# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సికిల్ సెల్ వ్యాధిని దేశం నుండి శాశ్వతంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.
- `భారత యువశక్తి' గురించి ప్రపంచమంతా చర్చిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా పాస్‌పోర్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు.
- నేరాలకు సంబంధించిన చట్టాల్లో ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

సికిల్ సెల్ వ్యాధిని దేశం నుండి శాశ్వతంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. ఈ వ్యాధి ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుంది కాబట్టి.. తేలికగా తీసుకోవద్దని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులకు రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. `ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం` సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఓంకారేశ్వర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ద్రౌపది ముర్ము ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జాతీయ లక్ష్యాలను నెరవేర్చే 2047 సంవత్సరం కంటే ముందే దేశం సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ జన్యుపరమైన రక్త రుగ్మతపై గిరిజన వర్గాల్లో అవగాహన పెంచడానికి సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచమంతా `భారత యువశక్తి' గురించే చర్చిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (PM- VBRY) కింద లబ్ధిదారులకు 2 వేల 400 కోట్ల రూపాయల నిధులను ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో ప్రధాని ఈరోజు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... దేశ యువతలో అసాధారణ సామర్థ్యం ఉందన్నారు. PM- VBRY పథకం ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 70 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించబడి తొలిసారి ఉద్యోగాల్లో చేరిన యువతకు సామాజిక భద్రత లభించిందని తెలిపారు. భారతదేశం.. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులు కలిగిన దేశాల్లో ఒకటి అని నరేంద్ర మోదీ గుర్తు చేశారు. నైపుణ్యాల ద్వారానే యువత కలలు సాధ్యపడతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ ఎకానమీ, స్పేస్, స్టార్టప్స్ వంటి అన్ని రంగాల్లో ఉపాధి మార్గాలను పటిష్టం చేశామని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ రక్షణ రంగ ఉత్పత్తి 2014లో 46 వేల కోట్ల రూపాయల నుండి గత ఆర్థిక సంవత్సరంలో లక్షా 78 వేల కోట్ల రూపాయలకు పెరిగిందని ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. దేశీయంగా తయారైన రక్షణ పరికరాలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఇది సాధ్యపడిందని అన్నారు. రక్షణ ఎగుమతులు దాదాపు 40 వేల కోట్ల రూపాయలకు పెరిగాయని వివరించారు. నాగ్‌పూర్‌లోని అంబాజారిలో ఉన్న యంత్ర ఇండియా లిమిటెడ్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అత్యాధునిక 10 వేల టన్నుల సామర్థ్యం గల `అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్`కు రక్షణమంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధాన రక్షణ పరికరాలతో పాటుగా వాటిలో ఉపయోగించే చిన్న విడిభాగాలు కూడా అంతే కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్ ద్వారా తయారయ్యే విడిభాగాలు కేవలం రక్షణ పరికరాల్లోనే కాకుండా.. రైల్వేలు, ఇస్రో (ISRO), డీఆర్‌డీఓ (DRDO) వంటి సంస్థలలో యంత్రాలకు కూడా వినియోగించబడతాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా పాస్ పోర్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన `వార్షిక ప్రాంతీయ పాస్ పోర్ట్ అధికారుల సదస్సు`లో ఆయన మాట్లాడుతూ.. పాస్ పోర్ట్ జారీ ప్రక్రియ వేగవంతంగా, సురక్షితంగా ఉండేలా సరళతరం చేసినట్లుగా చెప్పారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా ఈ మార్పు జరుగుతున్నదని తెలిపారు. డిజిటల్ పాలనకు ఇది ఒక నిదర్శనమని అన్నారు. పాస్ పోర్ట్ కేవలం కొన్ని పేజీల పుస్తకం కాదని.. జాతీయ గుర్తింపునకు ఒక శక్తివంతమైన సాధనమని అభివర్ణించారు. దేశ విదేశాంగ విధానం భారతదేశాన్ని ఒక `విశ్వబంధువు`గా నిలబెడుతోందని పేర్కొన్నారు. భారతీయ పాస్‌పోర్ట్‌ను అంతర్జాతీయంగా గౌరవంగా, విశ్వాసంతో చూస్తారని జైశంకర్ గుర్తు చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

నేరాలకు సంబంధించిన చట్టాల్లో ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన 26వ అఖిల భారత వేలిముద్రల సదస్సు ప్రారంభోపన్యాసంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుండి శిక్ష పడే వరకు మూడు సంవత్సరాలలోపు న్యాయం జరిగేలా చూడటం క్రిమినల్ జస్టిస్ సంస్కరణల ముఖ్య ఉద్దేశ్యంగా వెల్లడించారు. ఎన్‌సిఆర్‌బి-అభిజ్ఞాన్, సిఆర్‌పిఐ, ఇ-ప్రాసిక్యూషన్ 2.0, ఇ-ఫోరెన్సిక్స్ 2.0 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించడానికి, సకాలంలో న్యాయం అందించడానికి దోహదపడతాయని అన్నారు. కేసుల పెండింగ్‌ను తగ్గించడానికి ఒక బ్లూప్రింట్‌ను సిద్ధం చేసేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సుప్రీంకోర్టు,

హైకోర్టులతో కలిసి పని చేస్తోందని చెప్పారు. నేరం జరగకముందే నివారించడమే లక్ష్యంగా ప్రిడిక్టివ్ పోలీసింగ్ ఫ్రేమ్‌వర్క్ వైపు చర్యలు చేపడుతున్నామని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్య సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో `PIB వార్తాలాప్`ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత పన్నెండేళ్లలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి బలమైన పునాదిని వేశాయని పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, డిజిటల్ పాలన, ఆర్థిక సమ్మిళితం, సామాజిక సంక్షేమం వంటి రంగాలలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను కూడా ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఖచ్చితమైన, వాస్తవమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని భూపతిరాజు శ్రీనివాస వర్మ పాత్రికేయులను కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మహిళలకు రక్షణ కోసం ``ప్రివెన్షన్ ఆఫ్ ది సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్‌ప్లేస్`` పోష్ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ మహిళా కమిషన్ దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. ప్రభుత్వ, ప్రైవేట్, వ్యవస్థీకృత లేదా అసంఘటిత రంగంలోని ప్రతి కార్యాలయంలోనూ POSH చట్టంలోని నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా చూడాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు తక్షణమే చర్యలు తీసుకోవడానికి 18 చర్యలను కూడా కమిషన్ సిఫార్సు చేసింది. మహిళలు పని చేసే చోట రక్షణ ఉండాలని జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

గత పన్నెండేళ్లలో దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేసిందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. గాంధీనగర్‌లో ఈ రోజు నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గడచిన కాలంలో దేశం గణనీయమైన మార్పును చూసిందన్నారు. అత్యంత పేద వర్గాలకు కీలకమైన వనరులను నేరుగా అందించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతమైందని చెప్పారు. రోడ్లు, రైల్వేలు, ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ వంటి అత్యవసర మౌలిక సదుపాయాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు వరకూ చేరాయని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =